## క్లుప్తంగా

### వేసవి శిబిరాలను సద్వినియోగం చేసుకోండి


వేసవి విజ్ఞాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న సర్పంచు, హెచ్ఎం

కొత్తపల్లి: గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరాలను యువతీ యువకులు, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సర్పంచు లక్ష్మీదేవి, జెడ్పీహెచ్ఎస్ హెడ్ మాస్టర్ సుబ్బారెడ్డిలు అన్నారు. సోమవారం లైబ్రేరియన్ కౌసల్య ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరాన్ని ప్రారంభించారు. వారు మాట్లాడుతూ విద్యార్థులకు వేసవి విజ్ఞాన శిబిరం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. విద్యార్థులు ఎండలలో ఎక్కడపడితే అక్కడ తిరగకుండా పుస్తకాలపై శ్రద్ధ వహించేందుకు తోడ్పతుందన్నారు. అనంతరం క్యారమ్స్, ఖో ఖో, వంటి ఆటపాటలతో విద్యార్థులకు వినోదాన్ని కలిగించారు.

### బీమా సాయం అందజేత


ఆర్థికసాయం అందజేస్తున్న జెడ్పీటీసీ పుల్యాల దివ్య, గ్రామసర్పంచ్ పెరుమాల శేషన్న

పగిడ్యాల: ఈనెల 6న అనారోగ్యంతో మృతి చెందిన చాకలి శ్రీనివాసులు కుటుంబానికి మంజూరైన వైఎస్సార్ బీమా తక్షణ ఆర్థిక సహాయం రూ.10వేలను జెడ్పీటీసీ పుల్యాల దివ్య, గ్రామసర్పంచ్ పెరుమాల శేషన్న చేతుల మీదుగా మృతుని భార్య చాకలి శ్రీదేవికి సోమవారం అందజేశారు. అనంతరం వారు కుటుంబసభ్యులను పరామర్శించి, ఓదార్చారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఉపేంద్రారెడ్డి, వెల్ఫేర్ అసిస్టెంటు గణేష్, వలంటీర్లు శేషన్న, శివ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

### భూముల వేలంలో పెరిగిన ఆదాయం

జూపాడుబంగ్లా: తూడిచెర్ల గ్రామంలోని శ్రీశంకరమల్లేశ్వర, వీరభద్ర, లింగమయ్యస్వామి వార్ల మాన్యం భూములను సోమవారం వేలం వేయగా గతేడాది కంటే ఆదాయం భారీగా పెరిగినట్లు ఆలయ ఈఓ జనార్దన్ తెలిపారు. 50 మంది రైతులు వేలం పాటల్లో పాల్గొన్నారు. వేలం పాటలో రూ.5,79,000 నగదు సమకూరింది. గతేడాది కంటే రూ.2,44,000ల ఆదాయం పెరిగినట్లు ఈఓ తెలిపారు. వీరభద్ర, లింగమయ్యస్వామివార్ల భూములు వేలం వేయగా రూ.3,46,000ల ఆదాయం రాగా, గతేడాది కంటే రూ.1,44,000ల ఆదాయం పెరిగినట్లు తెలిపారు. కార్యక్రమంలో దేవాలయ కమిటీ సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

### మహానందిలో భక్తజన సందడి


మహానంది కోనేరులో భక్తుల పుణ్యస్నానాలు

మహానంది: వేసవి సెలవులకు తోడు మహానందీశ్వరస్వామి వారికి ప్రీతికరమైన సోమవారం ఆలయంలో భక్తజనసందడి నెలకొంది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణతో పాటు తమిళనాడు, మహారాష్ట్రల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఆలయానికి వచ్చిన భక్తులు రుద్రగుండం, బ్రహ్మగుండం, విష్ణుగుండం కోనేరులలో పుణ్యస్నానాలు ఆచరించారు. శ్రీ కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి వార్లను దర్శించుకున్నారు. ఈ నెలలో రద్దీ నేపథ్యంలో నెలరోజుల పాటు నిర్విరామంగా దర్శన సౌకర్యం ఉంటుందని ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు.

### నేడు హుండీ కానుకల లెక్కింపు

మహానంది: మహానంది దేవస్థానంలో మంగళవారం హుండీ కానుకల లెక్కింపు ఉంటుందని ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ శ్రీ కామేశ్వరీదేవి, మహానందీశ్వరస్వామి, కోదండరామాలయం, ఆంజనేయస్వామి, వినాయకనంది ఆలయాలతో పాటు అన్నదానం విభాగాల్లోని హుండీ కానుకలను లెక్కిస్తామన్నారు. స్థానిక అభిషేక మండపంలో జరిగే లెక్కింపునకు సిబ్బంది తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు.

### 10న సర్వసభ్య సమావేశం

జూపాడుబంగ్లా: ఈనెల 10న ఎంపీపీ సువర్ణమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ మంజులవాణి సోమవారం తెలిపారు. బుధవారం ఉదయం 10 గంటలకు సర్వసభ్య సమావేశం ప్రారంభమవుతుందన్నారు. సమావేశానికి మండలంలోని అన్నిశాఖల అధికారులు తమ ప్రగతి నివేదికలతో హాజరుకావాలన్నారు.

# జాగ్రత్తలతోనే నష్టాల నివారణ

- బొప్పాయి చెట్లు నాటినప్పటి నుంచి పంట చేతికొచ్చే వరకూ కాపాడుకోవాలి
- చెట్లకు సపోర్టుగా కర్రలను పాతుకోవాలి
- తోటలో వర్షపునీరు నిల్వ ఉండకుండా బయటకు పంపాలి
- అధికారుల సూచన మేరకు మందులు పిచికారీ చేయాలి


తంగడంచ వద్ద దెబ్బతిన్న బొప్పాయి పండ్ల తోట

జూపాడుబంగ్లా: ఇటీవల వీచిన గాలులు, కురిసిన అకాల వర్షాలకు నియోజకవర్గంలోని బొప్పాయి తోటలు దెబ్బతిన్నాయి. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. బొప్పాయి చెట్లు నాటినప్పటి నుంచి పంట దిగుబడి వచ్చేంత వరకు జాగ్రత్తగా కాపాడుకోవాలని హార్టికల్చర్ అధికారిణి తేజశ్విని తెలిపారు. చెట్లు పెరిగి పెద్దగయ్యేవరకు వాటికి సపోర్టుగా కర్రలను పాతుకోవడం మంచిదన్నారు. బొప్పాయి తోటలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఆమె వివరించారు.

**నియోజకవర్గంలో 125 ఎకరాల్లో సాగు**

నందికొట్కూరు నియోజకవర్గంలోని జూపాడుబంగ్లా మండలంలో 30 ఎకరాలు, మిడుతూరులో 30, పగిడ్యాల మండలంలో 10, కొత్తపల్లిలో 25 ఎకరాలు, పాములపాడు మండలంలో 30 ఎకరాల్లో మొత్తం 125 ఎకరాల్లో బొప్పాయి తోటలను సాగుచేశారు. ఇందులో ఇటీవల వీచిన గాలులకు, కురిసిన అకాల వర్షాలకు 30 ఎకరాల్లో తోటలు 33 శాతానికి పైగా దెబ్బతిన్నట్లు అధికారులు గుర్తించారు.

**నీరు బయటకు పంపాలి**

కొత్తగా బొప్పాయి మొక్కలు నాటిన సమయంలో అధిక వర్షాలు కురిసినట్లయితే వెంటనే పొలంలోని నీళ్లు బయటకు వెళ్లేలా కాల్వలు ఏర్పాటుచేసి నీటిని పొలం నుంచి బయటకు పంపాలి. అధిక వర్షాల వల్ల బొప్పాయి మొక్కలు పసుపురంగులోకి మారటం, వేరుకుళ్లు తెగులు వ్యాపించటం, చెట్లు కుళ్లిపోవటం వంటి తెగుళ్లు వ్యాపిస్తాయి. అలాంటి తెగులు వ్యాపించినట్లయితే వెంటనే లీటరు నీటికి 2 గ్రాముల చొప్పున రెడోమిల్‌ను కలిపి పిచికారీ చేసుకోవాలని ఉద్యాన అధికారిణి సూచించారు. లేదా ఎలైట్ మందును లీటరు నీటికి రెండు గ్రాముల చొప్పున కలిపి మొక్కల మొదలు వద్ద నీటిని పోయాలన్నారు. మొక్కలు కాపుకు వచ్చిన సమయంలో వాటికి తెగుళ్లు వ్యాపించకుండా హెక్సాకొనజోల్ మందును లీటరు నీటికి రెండు గ్రాముల చొప్పున కలిపి మొక్కలపై పిచికారీ చేసుకోవాలని తెలిపారు.

**ఈగల ఉధృతిని ఇలా నివారించుకోవాలి..**

అధిక వర్షాల వల్ల బొప్పాయి పండ్లకు ఈగలు వ్యాపించటం అధికమవుతుంది. ఈగల ఉధృతి నివారణకు గాను ఎకరాకు 15 చొప్పున మిథైయిల్ యుజినాల్ ఏరల అట్టలను ఏర్పాటు చేసుకోవాలి. అధిక వర్షాల వల్ల నేల కోతకు గురై నేలసారం తగ్గటంతో పాటు చెట్లవేర్లు బయటపడి చెట్లు నేలమట్టమయ్యే అవకాశాలున్నాయి. ఇలాంటి సమయంలో నేల కోతకు గురైన ప్రాంతంలో వెంటనే మట్టిని సరిచేసుకోవటంతోపాటు నేలకొరిగిన చెట్లను పంగల కర్రలతో సరిచేసుకోవాలలి. అలాగే వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనలు పాటించి నేలసారం పెరిగేందుకు అవసరమైన ఎరువులు వినియోగించాలన్నారు. కాసిన పండ్లు త్వరగా కుళ్లకుండా చెట్లకు జింక్, బోరాన్, మెగ్నిషియం, పొటాష్ వంటి సూక్ష్మపోషకాలను చెట్లపై పిచికారీ చేసుకోవాలి. ముఖ్యంగా బొప్పాయి తోటను నాటుకోవటానికి ముందే తోటకు నాలుగువైపులా ఈదురుగాలుల ఉధృతిని నివారించేందుకుగాను సుబాబుల చెట్లను నాటుకోవడం ఉత్తమం. తద్వారా పంటను కాపాడుకోవటం సులభమవుతుందన్నారు. వీటితో పాటు రైతులు ఎప్పటికప్పుడు ఉద్యాన అధికారుల సలహాలు, సూచనలు పాటిస్తూ బొప్పాయి పంటలో అధిక దిగుబడులు సాధించుకోవచ్చు.

### 'స్పందన' అర్జీలపై నిర్లక్ష్యం తగదు

పాములపాడు: స్పందన కార్యక్రమంలో ప్రజల నుంచి అర్జీలపై నిర్లక్ష్యం చేయరాదని తహసీల్దార్ రత్నరాధిక అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. సమస్య తీవ్రతరమైతే ఆయా శాఖల ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సుమిత్రమ్మ, ఏఓ ఫణీశ్వరరెడ్డి, ఏ ఈలు రాఘవేరంప్రసాద్, శివరామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### సమస్యలను పరిష్కరించుకోండి

జూపాడుబంగ్లా: ప్రజలు వారి వ్యక్తిగత, గ్రామాల్లోని సమస్యలను లిఖితపూర్వకంగా స్పందనలో తెలియజేసి పరిష్కరించుకోవాలని తహసీల్దార్ పుల్లయ్యయాదవ్, ఎంపీడీఓ మంజులవాణి సూచించారు. సోమవారం జూపాడుబంగ్లా తహసీల్దార్ కార్యాలయంలో వివిధశాఖల అధికారుల అధ్వర్యంలో స్పందన కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ప్రజలు వ్యయ, ప్రయాసల కోర్చి జిల్లా కేంద్రమైన నంద్యాలకు వెళ్లి కలెక్టర్ స్పందనలో సమస్యలు తెలియజేయటానికి ముందే మండలస్థాయిలో సోమవారం నిర్వహించే స్పందనలో పరిష్కరించుకోవచ్చునన్నారు. చిన్న చిన్న సమస్యలకు అక్కడికక్కడే పరిష్కారం చూపుతామన్నారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ మణిమంజరి, ఏఈలు బషీర్, ఎంఈఓ మోహన్, ఏఓ కృష్ణారెడ్డి, ఏపీఓ గౌరీబాయి పాల్గొన్నారు.

## పంటలు దెబ్బతిన్న రైతులను ఆదుకుంటాం


దెబ్బతిన్న బొప్పాయి తోటను పరిశీలిస్తున్న అధికారులు

జూపాడుబంగ్లా: అకాలంగా కురిసిన అధిక వర్షాల వల్ల పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకుంటుందని ఏపీఎంబీపీ కమిషనర్ ఓఎస్డీ, ప్రత్యేకాధికారి వైపీఎస్ ప్రసాదు తెలిపారు. సోమవారం ఆయన మండలంలోని తంగడంచ గ్రామంలో గాలి, వానతో కూడిన అధిక వర్షాల వల్ల దెబ్బతిన్న బొప్పాయి పంటను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన నష్టపోయిన పంటను పరిశీలించి 30శాతం కంటే అధికంగా బొప్పాయి పంట దెబ్బతిన్నందున రైతుకు నష్టపరిహారం వర్తించేలా నివేదికలు పంపించాలని సిబ్బందిని ఆదేశించారు. రైతు గోవిందమ్మతో మాట్లాడి పంటసాగుకు అయిన ఖర్చు, సాధించిన దిగుబడి తదితర వివరాలను తెలుసుకున్నారు. ప్రకృతి వైపరీత్యాల వల్ల బొప్పాయి పంటలకు నష్టం వాటిల్లితే హెక్టారుకు రూ.15వేల మేర ప్రభుత్వం నష్టపరిహారం అందజేస్తుందని తెలిపారు. జిల్లాలో ఇంకా ఎవరైనా రైతులు అధిక వర్షాలు, గాలి,వాన ధాటికి పంటలు నష్టపోయినవారు ఉన్నట్లయితే వెంటనే ఆర్బీకేల సిబ్బందిని ఆశ్రయించి పేర్లు నమోదు చేయించుకోవాలని తెలిపారు. ఈయన వెంట నంద్యాల జిల్లా హార్టికల్చర్ అధికారి నాగరాజు, నందికొట్కూరు హార్టికల్చర్ అధికారిణి తేజశ్విని, తంగడంచ ఆర్బీకే వీహెచ్ఏ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## భక్తులకు అసౌకర్యం కలగకుండా చర్యలు


కుంభాభిషేకం ఏర్పాట్లు పరిశీలిస్తున్న చైర్మన్

శ్రీశైలంటెంపుల్: క్యూలైన్లలో భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా చూసుకోవాలని శ్రీశైలదేవస్థాన ధర్మకర్తల మండలి చైర్మన్ రెడ్డివారి చక్రపాణిరెడ్డి అధికారులను ఆదేశించారు. శ్రీశైల దేవస్థానంలో జరుగుతున్న పలు అభివృద్ధి కార్యక్రమాలను సోమవారం పరిశీలించారు. క్షేత్రంలో మహాకుంభాభిషేకం కోసం ఏర్పాటు చేస్తున్న యాగశాల, గణేష సదనం క్యూలైన్లు, ఇంజినీరింగ్ పనులు, భద్రత, విరాళాల సేకరణ తదితర పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. క్యూలైన్లలో రద్దీకి అనుగుణంగా నిరంతరం మంచినీరు , అల్పాహారం, బిస్కెట్లు, అందిస్తుండాలని సూచించారు. దర్శనానికి పట్టే సమయాన్ని ఆలయ ప్రసార వ్యవస్థ ద్వారా నిరంతరం తెలియజేస్తూ ఉండాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం దేవస్థానం చేస్తున్న ఏర్పాట్లుపై భక్తులతో ముఖాముఖిగా సంభాషించారు. అలాగే దాతలకు విరాళాల పథకం గురించి స్పష్టంగా వివరించాలని, విరివిగా విరాళాలు అందించేలా ప్రోత్సహించాలని సిబ్బందికి సూచించారు. ఆయన వెంట ఎగ్జిక్యూటీవ్ ఇంజినీర్ రామకృష్ణ, నరసింహారెడ్డి, ఏఈఓ ఫణిదర ప్రసాద్, పర్యవేక్షలు అయ్యన్న, ఏఈ భవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## రాయితీ విత్తనాలను సద్వినియోగం చేసుకోండి

జూపాడుబంగ్లా: జూన్‌లో ప్రారంభం కానున్న ఖరీఫ్ సీజన్‌కు అవసరమైన రాయితీ విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి కృష్ణారెడ్డి సూచించారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలానికి 38 క్వింటాళ్ల జీలుగ విత్తనాలు మంజూరైనట్లు తెలిపారు. క్వింటాలు జీలుగ విత్తనాలు రూ.7,900లు కాగా 90శాతం రాయితీ పోను రైతులు కేవలం క్వింటాకు రూ.790లు చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఎకరాకు పదికిలోల చొప్పున ఐదు ఎకరాల వరకు రాయితీపై జీలుగ విత్తనాలు మంజూరు చేస్తారని తెలిపారు. అలాగే 20క్వింటాళ్ల కందులు, 6 క్వింటాళ్ల మినుములు, 5 క్వింటాళ్ల పెసలు, 21 క్వింటాళ్ల పిల్లిపెసర విత్తనాలు మంజూరైనట్లు తెలిపారు. అవసరమైన రైతులు గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాల్లో నగదు చెల్లించి పేర్లు నమోదు చేయించుకోవాలన్నారు.

**171 క్వింటాళ్ల విత్తనాలు మంజూరు**

పాములపాడు: మండలానికి వివిధ రకాల విత్తనాలు రాయితీపై 171 క్వింటాళ్లు మంజూరైనట్లు మండల వ్యవసాయాధికారి ఫణీశ్వరరెడ్డి అన్నారు. సోమవారం స్థానిక మండల వ్యవసాయాధికారి కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ మండలానికి అన్ని రకాల విత్తనాలు 183 క్వింటాళ్లు కావాలని ప్రతిపాదనలు పంపామని, 171 మంజూరు అయ్యాయని వివరించారు. కందులు 10 క్వింటాళ్లకు గాను 7 క్వింటాళ్లు, మినుములు 5 క్వింటాళ్లకు గాను 2 క్వింటాళ్లు, జీలుగలు 150 క్వింటాళ్లకు గాను 150 క్వింటాళ్లు, పిల్ల పెసర 18 క్వింటాళ్లకు గాను 12 క్వింటాళ్లు చొప్పున మంజూరయ్యాయి. త్వరలో రైతులకు పంపిణీ చేయనున్నట్లు వివరించారు.


### 15న కలెక్టరేట్ వద్ద ధర్నా

పగిడ్యాల: ఈనెల 15న నంద్యాల జిల్లా కలెక్టరేట్ కార్యాలయం వద్ద చేపట్టనున్న ధర్నాను విజయవంతం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకుడు నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. మండలంలోని లక్ష్మాపురం అంబెవద్ద సోమవారం ఉపాధి కూలీలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కేంద్రంలో అధికారం చెలాయిస్తున్న బీజేపీ ప్రభుత్వం ఉపాధిహామీ చట్టాన్ని నిర్వీర్యం చేస్తోందన్నారు. గత బడ్జెట్‌లో రూ.98వేల కోట్లు కేటాయించగా ఈ బడ్జెట్‌లో కేవలం 60వేలు కోట్లు మాత్రమే కేటాయించటం దుర్మార్గమైన చర్యగా పేర్కొన్నారు. ధర్నాకు ఉపాధికూలీలు భారీగా తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకుడు పక్కీర్‌సాహెబ్, గోపాలకృష్ణ, కూలీలు ప్రసాద్, అశోక్, జ్యోతి పాల్గొన్నారు.

### మహానందిలో వర్షం

మహానంది: మహానంది పుణ్యక్షేత్రంతో పాటు పరిసర గ్రామాల్లో సోమవారం సాయంత్రం ఓ మోస్తరు వర్షం కురిసింది. ఇదిలా ఉండగా గత కొద్దిరోజులుగా కురుస్తున్న అకాల వర్షాలు, భారీ గాలులకు అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే బుక్కాపురం, తిమ్మాపురం, గోపవరం, గ్రామాల పరిధిలో వరి, మొక్కజొన్న, అరటి పంటల్లో తీవ్ర నష్టం వాటిల్లింది.

## వేసవిలో విజ్ఞానం పెంచుకోండి


మండల టాపర్ స్నేహలతారెడ్డిని సన్మానిస్తున్న ఎంపీపీ, ప్రజాప్రతినిధులు

వెలుగోడు: వేసవి సెలవుల్లో విద్యార్థులు సమయాన్ని వృథా చేసుకోకుండా విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని ఎంపీపీ లాలం రమేష్ సూచించారు. సోమవారం స్థానిక గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరాన్ని ఎంపీపీ, జిల్లా కో ఆప్షన్ మెంబరు సయ్యద్ సులేమాన్ ప్రారంభించారు. వారు మాట్లాడుతూ గ్రంథాలయాల ద్వారా విజ్ఞానం పెంపొందించుకునే అవకాశం ఉంటుందన్నారు.

**10వ తరగతి టాపర్‌కు సన్మానం**

ఇటీవల విడుదలైన 10వ తరగతి ఫలితాల్లో మండల టాపర్‌గా నిలిచిన లిటిల్ ఏంజెల్ ఇంగ్లిషు మీడియం స్కూల్ విద్యార్థిని స్నేహలతారెడ్డిని ఎంపీపీ, ప్రజాప్రతినిధులు సోమవారం సన్మానించారు. 600 మార్కులకు 581 మార్కులు సాధించడం మండలానికే గర్వకారణమన్నారు. కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచు ముబీనా, లిటిల్ ఏంజల్ స్కూల్ కరస్పాండెంట్ ఇమ్మానియేల్, గ్రంథాలయ అధికారి సుమలత తదితరులు పాల్గొన్నారు.

# ప్రజారంజకంగా జగనన్న పాలన

- ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి
- యర్రగుంట్ల గ్రామంలో 'గడప గడపకు మన ప్రభుత్వం'


మహిళకు సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి

వెలుగోడు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన ప్రజా రంజకంగా సాగుతోందని, పేదల గుండెల్లో ఆయన సుస్థిర స్థానం సంపాదించుకున్నారని ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి అన్నారు. సోమవారం బండిఆత్మకూరు మండలంలోని యర్రగుంట్ల గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలోని ప్రతి గడప వద్దకు వెళ్లి ప్రజల సమ్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. తర్వాత ఒక్కో కుటుంబానికి ప్రభుత్వం తరఫున ఎంత లబ్ధి చేకూరిందో వివరించారు. ఎస్సీ కాలనీలో పైపులైను ఏర్పాటు చేయాలని కాలనీ ప్రజలు కోరారు. దీంతో ఎమ్మెల్యే స్పందించి ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ లక్ష్మీ నారాయణను ప్రతిపాదనలు తయారు చేయాలని సూచించారు. అలాగే విద్యుత్ స్తంభాలు కావాలని, సీసీరోడ్లు, డ్రైనేజీ సౌకర్యం, ఇంటి స్థలాలు, పక్కా గృహాలు మంజూరు చేయాలని పలువురు కోరారు. దీంతో ఎమ్మెల్యే ప్రతి ఒక్కరి సమస్యను విని పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

**సిఫార్సు లేకుండానే పథకాలు**

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పరిపాలనలో ఎటువంటి సిఫార్సు లేకుండా పథకాలు అందే విధంగా సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేయడం జరిగిందని ఎమ్మెల్యే అన్నారు. సచివాలయ సిబ్బంది ప్రతి రోజూ ప్రజల నుంచి వచ్చే దరఖాస్తులను తీసుకొని పరిష్కరిస్తారని చెప్పారు. అంతేకాక తల్లి గర్భంలో నుంచే సంక్షేమ పథకాలు వర్తించేలా ముఖ్యమంత్రి కృషి చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు శిల్పా భువనేశ్వరరెడ్డి, ద్వారం పుల్లారెడ్డి, మాజీ ఎంపీపీ దేసు వెంకటరామిరెడ్డి, సర్పంచు శ్వేత కుమారి, ప్రసాద్, ఎంపీటీసీ మైకెల్, పుల్లయ్య, మధుసుదన్‌రెడ్డి, నాగేశ్వరరెడ్డి, పరమటూరు సహకార సంఘం చైర్మన్ శివలింగం, సుబ్బయ్య యాదవ్, వెంకటసుబ్బయ్య, ఎంపీడీఓ వాసుదేవ గుప్తా, ట్రాన్స్‌కో ఏఈ ప్రసాద్ రెడ్డి, హౌసింగ్ ఏఈ సుంకిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### ఆరో తరగతి ప్రవేశాలకు దరఖాస్తుల అహ్వానం

మిడుతూరు: 2023–24 విద్యా సంవత్సరానికి ఏపీ మోడల్ స్కూలు (ఆదర్శ పాఠశాల) ఆరో తరగతి ప్రవేశానికి ఆసక్తి గల విద్యార్థిని, విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపాల్ సలీంబాషా సోమవారం తెలిపారు. ఎస్సీ,ఎస్టీ విద్యార్థులు రూ.75, ఓసీ, బీసీ విద్యార్థులు రూ. 150 చెల్లించి ఈ నెల 9 నుంచి 25వ తేదీ లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకున్న విద్యార్థినీ విద్యార్థులకు ప్రవేశ పరీక్ష వచ్చేనెల 11వ తేదీ ఉదయం 10 గంటలకు ఏపీ మోడల్ స్కూలు మిడుతూరులో నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

### 'మల్లికార్జున రిజర్వాయర్ వద్దే వద్దు'

మిడుతూరు: మా ప్రాంతంలో మల్లికార్జున రిజర్వాయర్ ప్రాజెక్టు వద్దే వద్దంటూ దేవనూరు, చింతలపల్లి, గుడిపాడు, 49–బన్నూరు రైతులు సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. వారు మాట్లాడుతూ మా ప్రాంతంలో సారవంతమైన వ్యవసాయ భూములు ఉన్నాయని, ఆ భూములతో జీవనం గడుపుతున్నామన్నారు. రిజర్వాయర్‌కు సంబంధించిన మ్యాప్‌లో దేవనూరు, చింతలపల్లి, గుడిపాడు, 49–బన్నూరు, సున్నంపల్లి తదితర గ్రామాల పరిధిలోని భూములు పోతున్నాయని ఉందన్నారు. 15 టీఎంసీలు నిల్వ ఉండే రిజర్వాయర్ ఏర్పాటు చేస్తే ప్రజలు ఊర్లు వదిలిపెట్టాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం తహసీల్దార్ సిరాజుద్దీన్‌కు వినతిపత్రం అందజేశారు. ఏపీ రైతు సంఘం నాయకులు వెంకటేశ్వర్లు, రామక్రిష్ణ పాల్గొన్నారు.

### ప్రైవేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి

నందికొట్కూరు: ప్రభుత్వ నిబంధనలు పాటించని ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని రెవెన్యూ కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో తహసీల్దార్ రాజశేఖర్‌బాబుకు కూడిన వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కి రంగు రంగుల కరపత్రాలతో వంద శాతం ఉత్తీర్ణత సాధించారని ప్రచారం చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో మహానంది, వీరేంద్ర, వినోద్ పాల్గొన్నారు.

### రెడ్‌క్రాస్ సేవలు మరువలేనివి

నంద్యాల: జిల్లాలో రెడ్‌క్రాస్ సొసైటీ సేవలు మరువలేనివని జాయింట్ కలెక్టర్ నిశాంతి పేర్కొన్నారు. రెడ్ క్రాస్ వరల్డ్ డే సందర్భంగా సోమవారం కలెక్టరేట్‌లో రెడ్‌క్రాస్ వ్యవస్థాపకుడు హెన్రీ డ్యూనాంట్ చిత్రపటానికి జేసీ, అధికారులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో ముద్రించిన వడదెబ్బ, వడగాలులపై అవగాహన కార్యక్రమ కరపత్రాలను అధికారులతో కలిసి ఆవిష్కరించారు. రెడ్ క్రాస్ చైర్మన్ దస్తగిరి, డీఆర్ఓ పుల్లయ్య, జెడ్పీ డిప్యూటీ సీఈఓ సుబ్బారెడ్డి, జిల్లా వైద్యాధికారి వెంకటరమణ, డీఈఓ అనురాధ,

## ఆధ్యాత్మికం

### రాహుకేతు పూజలకు సర్వం సిద్ధం


ప్రతిష్ఠించనున్న రాహుకేతు విగ్రహాలు

మహానంది: రాష్ట్రంలోని ప్రముఖ పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతూ స్వయంభువుగా వెలిసిన శ్రీ మహానందీశ్వర స్వామి దేవస్థానంలో ఈ నెల 10వ తేదీ నుంచి రాహుకేతు పూజలు ప్రారంభం కానున్న విషయం తెలిసిందే. అందులో భాగంగా ఇప్పటికే దాతల సహకారంతో రాహుకేతు పూజలకు అవసరమైన మండపాన్ని సుందరంగా నిర్మించారు. దీంతో పాటు ప్రత్యేకంగా తయారు చేయించిన రాహుకేతు విగ్రహాలను తెప్పించారు. విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాన్ని ఈ నెల పదవ తేదీ నుంచి చేపట్టనున్నట్లు వేదపండితులు రవిశంకర అవధాని తెలిపారు. మహానందీశ్వరస్వామి పుట్టలో నుంచి స్వయంగా ఉద్భవించిన క్షేత్రమైన మహానందిలో చేయించుకునే రాహుకేతు పూజలకు శీఘ్ర ఫలితం వస్తుందని చెప్పారు. మూడు రోజుల పాటు ఉత్సవాలు జరగనున్నట్లు వివరించారు.

### వైభవంగా మహానందీశ్వరుడి పల్లకోత్సవం


స్వామి పల్లకోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

మహానంది: శ్రీ గంగా, కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి వార్లు సోమవారం రాత్రి పల్లకీలో విహరించారు. వేదపండితులు రవిశంకర అవధాని, శాంతారాంభట్ ఆధ్వర్యంలో అర్చకులు శరభయ్య శర్మ, తదితరులు స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులతో పాటు గోమాతను విశేషంగా అలంకరించారు. అలంకార హారతులు, అలంకార పూజల అనంతరం ఆలయ ప్రాకారంలోని నాలుగు వైపులా ఉత్సవం చేపట్టారు.

### కళారాధనలో భజన కార్యక్రమం



భజన చేస్తున్న శివరామాంజనేయ భజన మండలి

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలదేవస్థానం నిత్యకళారాధనలో భాగంగా నిర్వహిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా సోమవారం మహబూబ్‌నగర్‌కు చెందిన డి.రాంరెడ్డి, శివరామాంజనేయ భజన మండలి వారిచే ఏర్పాటు చేసిన భజన కార్యక్రమం భక్తులను అలరించింది. ఆలయ దక్షిణ మాడవీధిలోని కళావేదికపై ఈ కార్యక్రమం నిర్వహించారు.

## క్రైం కార్నర్

### భార్యపై అనుమానంతోనే హత్య


భార్య హత్య కేసులో అరెస్టు చూపిస్తున్న డీఎస్పీ శ్రీనివాసరావు

నందికొట్కూరు: భార్య లక్ష్మీదేవిపై అనుమానం, ఆమె పుట్టింటి వారితో భర్త హుసేనయ్యకు ఆర్థిక లావాదేవీలలో ఏర్పడిన వివాదాలే ఆమె హత్యకు కారణమయ్యాయని ఆత్మకూరు డీఎస్పీ శ్రీనివాసరావు తెలిపారు. సోమవారం పట్టణంలోని రూరల్ పోలీసు సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు తెలిపారు. అనంతరం లక్ష్మీదేవిని హత్య చేసిన భర్త హుసేనయ్యను డీఎస్పీ అరెస్టు చూపించారు. డీఎస్పీ మాట్లాడుతూ ఈ నెల 6వ తేదీన పగిడ్యాల మండలంలోని ఎం ఘనపురం గ్రామంలో జరిగిన హత్య కేసులో నిందితుడిని అరెస్టు చేసినట్లు తెలిపారు. క్షణికావేశంతోనే భార్యను హత్య చేసినట్లు దర్యాప్తులో తేలిందన్నారు. ఎలాంటి సమస్యలు వచ్చినా ప్రజలు నేరుగా పోలీసులను ఆశ్రయించాలని కోరారు. క్షణికావేశాల వలన వచ్చే సమస్యలపై ప్రజలకు అవగాహన కల్పిస్తామని చెప్పారు. సమావేశంలో రూరల్ సీఐ సుధాకర్‌రెడ్డి, అర్బన్ సీఐ విజయభాస్కర్, ముచ్చుమర్రి ఎస్ఐ నాగార్జున, పోలీసులు ఉన్నారు.